




ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
26-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 09
సంచిక: 257

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





# మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

ఆగని పెట్రో బాదుడు..

పెట్రోల్‌పై లీటరుకు రూ. 2.61,

డీజిల్‌పై రూ.2.71 చొప్పున పెంపు

11 రోజుల్లో నాలుగోసారి వడ్డన

మొత్తంగా రూ.7.5 పెరిగిన ధర

కేంద్ర ప్రభుత్వంపై విపక్షాల ఫైర్

న్యూఢిల్లీ, మే 25 : ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం.. ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున సోమవారం ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49



న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పద్మశ్రీ పురస్కారాలు స్వీకరిస్తున్న తెలంగాణకు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికారెడ్డి. వరుసగా యూజీసీ మాజీ చైర్మన్ మామిడాల జగదీశ్, ప్రముఖ ఆంకాలజిస్ట్ విజయ్ ఆనంద్ రెడ్డి, ప్రముఖ వైద్యులు జీ వెంకట్ రావు.

# చిప్ నుంచి షిప్ వరకు... ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం

2లో



టెక్నాలజీతో ఏపీని వేగంగా ముందుకు తీసుకెళతామన్న సీఎం చంద్రబాబు

- అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు నిర్ణయం
- 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని వెల్లడి
- చిప్ నుంచి షిప్ వరకు తయారీపై దృష్టి సారించామని స్పష్టం

టెక్నాలజీని అనుసంధానం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మెటా, అమెజాన్, జోహో వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందని,

## వడదెబ్బతో 49 మంది మృతి

మృతుల్లో నాలుగేళ్ల బాలుడు, ఆర్టీసీ కండక్టర్

ధాన్యం కొనుగోలు కేంద్రంలో కుప్పకూలి ప్రాణాలు విడిచిన రైతు



2లో

## గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు

కమీషన్ల కోసం జగన్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వేధించిందన్న అచ్చెన్నాయుడు

నాకెంత.. నీకెంత అంటూ దోచుకున్నారని విమర్శ

కూటమి ప్రభుత్వంలో రూ. 23 లక్షల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి

## ఒక్కటైనా కట్టారా?




2లో

# రైతు గోస పట్టదా?

రైతుల ఇబ్బందులు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి

'రైతుగోస-- బీజేపీ భరోసా'లో రాంచందర్‌రావు



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి రైతుల గోస పట్టడం లేదని, పండించిన పంటను అమ్ముకోలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో సోమవారం 'రైతుగోస-- బీజేపీ భరోసా'కార్యక్రమాన్ని ప్రారంభించి, మార్కెట్ యార్డులోని రైతులతో మాట్లాడారు. ఆ తర్వాత సిద్దిపేట జిల్లా గజ్వేల్ మార్కెట్ యార్డును కూడా సందర్శించి రైతులతో మాట్లాడారు. వరంగల్‌లో ఇచ్చిన డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ఏనాడో మర్చిపోయిందన్నారు. రియల్‌ఎస్టేట్ దందా తప్ప క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఎలా జరుగుతుందో సీఎంకు తెలియదన్నారు. ఇప్పటివరకు ఆయా జిల్లాల వారీగా ఎంతమేర ధాన్యం సేకరించారో శ్వేతపత్రం విడుదల చేయాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి

2లో

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట..

# రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్!

ఐఆర్‌ఎఫ్‌సీతో రూ.13,600 కోట్ల భారీ డీల్

20 ఏళ్ల పాటు చెల్లింపుల వెసులుబాటు

ప్రభుత్వానికే మెట్రో 100 శాతం వాటా

నగరంలో మరింత పెరగనున్న మెట్రో విస్తరణ

2లో

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం కుదిరింది. రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

**20 ఏళ్ల పాటు ఊరట**

ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఈ డీల్ ఖరారైంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్ల కాలపరిమితితో, ప్రతి మూడు నెలలకు ఒకసారి





## రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

సీపీఎం నేతలతో జరిగిన భేటీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీపీఎం నాయకులతో సమావేశంలో సీఎం వ్యాఖ్యలు

కనీస వేతనాల సవరణ చట్టంపై సీఎంకు ధన్యవాదాలు తెలిపిన సీపీఎం బృందం

## పవన్ కళ్యాణ్ సంచలన నిర్ణయం...

ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గం మొత్తం రద్దు

ప్రకాశం జిల్లా జనసేన కమిటీని రద్దు చేసిన పవన్

వర్గ విభేదాలు, క్రమశిక్షణారాహిత్యమే కారణమని వెల్లడి

25 మంది సభ్యుల మధ్య 54 గొడవలు ఉన్నాయని వ్యాఖ్య

ఇకపై పార్టీలో కఠినంగా వ్యవహరిస్తానని స్పష్టం

# ఒక్కటైనా కట్టారా?

(మొదటి పేజీ తరువాయి)

కూకట్‌పల్లి (హైదరాబాద్): అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా..హైదరాబాద్ నగరానికి కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అనేక ఫ్లై ఓవర్లు మొదలుకుని టిమ్స్ ఆసుపత్రి దాకా ప్రతి ఒక్కటీ తామే నిర్మించామని, ప్రస్తుతం వాటికే సీఎం రేవంత్‌రెడ్డి రిబ్బన్ కట్ చేస్తూ తామే నిర్మించామని చెప్పుకుంటున్నారని ధ్వజమెత్తారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నగరానికి ఒక్కటంటే ఒక్క రూపాయి కూడా అదనంగా ఖర్చు చేయలేని అసమర్థ ప్రభుత్వం అని మండిపడ్డారు. రెండున్నర సంవత్సరాల్లో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించినట్టు నిరూపించినా రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు. సోమవారం కూకట్‌పల్లిలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

**కాంగ్రెస్ మోసం చేసింది..**

'బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం అభివృద్ధి పైనే దృష్టి పెట్టాం. తెలంగాణకు 24 గంటల కరెంటు, తాగునీటిని అందించింది కేసీఆరే. కానీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు అడ్డగోలుగా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రతి వర్గాన్ని మోసం చేసింది. ప్రభుత్వ విధానాలతో హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతింది. లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు, సెంట్రింగ్ కార్మికులకు ఉపాధి లభించకుండా పోయింది. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ, సెంట్రింగ్ కార్మికుల కోసం బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం. నగరంలో ప్రతి ఇంటికీ 24 గంటలు తాగునీటిని సరఫరా చేస్తాం. ఈ బాధ్యత నేనే తీసుకుంటా..'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు

(మొదటి పేజీ తరువాయి)

గత జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించి, రాష్ట్ర



అభివృద్ధిని పాతాళానికి తొక్కేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం చీపుర్లపాడులో రూ.10.51 కోట్లతో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారంలో ఉండగా 'నాకెంత.. నీకెంత' అంటూ దోచుకున్న ఆ 'గొడ్డలి పార్టీ'కి గత ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెప్పారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.గత ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను ఆక్రమించుకోవాలని చూస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి రూ.15 వేల కోట్లు మంజూరు చేయించి ఉక్కు పరిశ్రమను కాపాడారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో కేవలం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించామని, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టేందుకు పరిశ్రమల స్థాపన అవసరమన్న ఆయన... నియోజకవర్గ తాగునీటి సమస్యకు రూ.620 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లా ప్రజల 60 ఏళ్ల కల అయిన 'నేరడి బ్యారేజీ'ని 2029 నాటికి వంద శాతం పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# వడదెబ్బతో 49 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వడదెబ్బకు గురయ్యే వారి సంఖ్యా పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో 49 మంది చనిపోయారు. వరంగల్ జిల్లా బుధరావుపేటలో గుండ్రపల్లి సదయ్య (58), ధర్మారంలో అంకేశ్వరపు సమ్మక్క (70), దమ్మన్నపేటలో అనసూర్య (68), ఖిలా వరంగల్ పడమరకోటలో బొల్లం వీరమల్లు (68), మొండ్రాయిలో తండ చేరాలు (75), పుల్లయబోడులో భూక్య నరేశ్ (29), సర్వాపురానికి చెందిన మండల వీరయ్య (74) వడదెబ్బతో మృతిచెందారు. పరకాల డిపోనకు చెందిన కండక్టర్ బి.శంకర్ (48) విధుల్లో భాగంగా భద్రాచలం నుంచి పరకాల బయలుదేరి కొత్తగూడెం దాటిన తర్వాత అనిశెట్టిపల్లి వద్ద వేడిగాలితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణికులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలిస్తుండగానే ప్రాణం కోల్పోయాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నగరంపల్లిలో గొర్రెలకాపరి కోడారి సాంబయ్య(52), అంకుషాపూర్‌లో వ్యవసాయ కూలీ మహమ్మద్ సైద్‌ఖాన్ (42), జనగామ జిల్లా రంగరాయగూడెంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అదే గ్రామానికి చెందిన రైతు నెలమంచ ఎలేందర్‌రెడ్డి (39) ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై చనిపోయాడు. శివునిపల్లికి చెందిన పిట్టల శంకర్--రవళి దంపతుల కుమారుడు అక్షిత్ (4) ఎండ తీవ్రతతో మృతి చెందాడు. ఘన్‌పూర్‌లో తాటికొండ నర్సమ్మ(65), కామారపు విజయ్ (60), వరంగల్ జిల్లా ఇటుకాలపల్లిలో కూలీ నైనబోయిన రాజు(44) హనుమకొండ జిల్లా నీరుకుళ్లలో మేస్త్రీ వద్ద పనిచేసే కూలీ వడదెబ్బతో చనిపోయాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పెయింటర్ కొమిరె రమేశ్ (39), బైపాస్‌రోడ్డులో ఉండే యాచకుడు షేక్ లతీఫ్ (50), ములుగుకు చెందిన బీజేపీ నేత అన్నపురెడ్డి ప్రమోద్‌రెడ్డి (49), కమలాపురంలో అన్నపు రెడ్డి లక్ష్మీబాయి (80), తిరువాయిపేట వెంకటరమణ (48), తాడి సత్యవతి (80) వడదెబ్బతో చనిపోయారు.

# పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం...

(మొదటి పేజీ తరువాయి)



జనసేన పార్టీలో తన పుష్కర కాలం నాటి సహనానికి స్వస్తి పలుకుతున్నానని, ఇకపై పార్టీలో క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పార్టీని ఒక సైనిక పటాలంలా ముందుకు నడిపించేందుకు కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేశారు. రాజమండ్రిలో జరిగిన పార్లమెంటరీ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీలో ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. దీనికి తొలి అడుగుగా, అంతర్గత కలహాలతో సతమతమవుతున్న ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రకాశం జిల్లా కమిటీలో తీవ్రమైన వర్గ విభేదాలు ఉన్నాయని, కేవలం 25 మంది సభ్యుల మధ్య ఏకంగా 54 గొడవలు ఉన్నాయని పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గత కలహాలతో ఒకరినొకరు పనిచేయనివ్వకుండా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో ఇలాంటి క్రమశిక్షణారాహిత్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పార్టీలో అందరికీ స్వేచ్ఛ ఇచ్చానని, కానీ ఇకపై తాను అనుకున్న పద్ధతిలోనే పార్టీని ముందుకు నడిపిస్తానని తేల్చిచెప్పారు. "ఒకే మార్గంలో నడవండి, లేదంటే పక్కకు తప్పుకోండి (ఫాల్ ఇన్ లైన్ ఆర్ ఫాల్ అవుట్ ఆఫ్ లైన్)" అంటూ గట్టిగా హెచ్చరించారు. ఈ నిర్ణయం ద్వారా పార్టీలో ఏ స్థాయి నేతలైనా క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు తప్పవనే బలమైన సందేశాన్ని పవన్ పంపించారు. త్వరలోనే ప్రకాశం జిల్లాకు కొత్త కార్యవర్గాన్ని నియమించనున్నట్లు సమాచారం.

# మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

నుంచి రూ. 95.20కి పెరిగింది. ఇంధన ధరలు 2022 మే తర్వాత ఇంత అత్యధిక స్థాయికి చేరుకోవడం ఇదే మొదటిసారి. హొర్ముజ్ జలసంధిని తిరిగి తెరువడానికి అమెరికా, ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిన తర్వాత ప్రపంచ చమురు ధరలకు ప్రాథమిక ప్రమాణమైన బెరట్ క్రూడ్ 5 శాతానికి పైగా పడిపోయింది. ఇరాన్ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, అలాగే కీలకమైన ప్రపంచ చమురు రవాణా మార్గమైన హొర్ముజ్ జలసంధి గుండా నౌకాయానానికి అంతరాయం కలుగడంతో ఫిబ్రవరి నెలాఖరు నుంచి ప్రపంచ ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి గృహోపయోగ వంటగ్యాస్ ధరను 14.2 కిలోల సిలిండర్ రూ. 60, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్(సీఎన్‌జీ) ధరను మే మధ్య నుండి కిలోకు రూ. 4 చొప్పున పెంచారు.

పెట్రోల్, డీజిల్ ధరల తాజా పెంపుపై ప్రతిపక్షాలు ప్రభుత్వంపై సోమవారం దాడిని కొనసాగించాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరలు నిలకడగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. ఇంధన ధరలను పదేపదే పెంచడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇంధన లూటీని కొనసాగిస్తున్నదని ఆయన ఆరోపించారు. సామాన్య ప్రజల పొదుపు మొత్తాలను దగ్ధం చేసేందుకు మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లిందని ఖర్గే వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఒక్క డాలరు కూడా పెరుగలేదని ఆయన చెప్పారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం 2014లో రూ. 71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను 2026 నాటికి రూ. 102.71కి పెంచిందని ఖర్గే చెప్పారు. అదే విధంగా లీటర్ డీజిల్ ధరను రూ. 56.71 నుంచి రూ. 95.20కి చేర్చిందని చెప్పారు. రష్యా, ఇరాన్ నుంచి తక్కువ ధరలకు ముడి చమురును ఎందుకు భారత్ కొనుగోలు చేయడం లేదని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు.

**పీఎన్‌జీ ఉంటే ఎల్పీజీ బంద్**

పైప్డ్ నేచురల్ గ్యాస్(పీఎన్‌జీ) వినియోగదారులు ఇకపై ఎల్‌పీజీ సిలిండర్లను కొనుగోలు చేయకూడదని భారత ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం తలెత్తడంతో, ప్రభుత్వం కొన్ని పరిశ్రమలకు ఎల్‌పీజీ సరఫరాను ఇప్పటికే నిలిపివేసింది.

మే 15న లీటర్‌కు రూ.3 చొప్పున తొలిసారిగా రిటైల్ ఇంధన ధరలను పెంచగా ఆ తర్వాత మే 19న 90 పైసలు, మే 23న పెట్రోల్ ధరలు 87 పైసలు, డీజిల్ ధరలు 91 పైసలు లీటర్‌కు పెరిగాయి. స్థానిక పన్నుల కారణంగా రాష్ట్రాలవారీగా ధరలు మారుతూ ఉంటాయి. సోమవారం పెంపు తర్వాత ముంబైలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ. 111.21, డీజిల్ ధర రూ. 97.83గా ఉండగా, కోల్‌కతాలో ధరలు వరుసగా రూ. 113.51, రూ. 99.82కి పెరిగాయి. చెన్నైలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ. 107.77, డీజిల్ ధర లీటర్‌కు రూ. 99.55గా ఉంది.

# హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట.. రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్!



ఈ రుణాన్ని చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న తక్షణ ఆర్థిక భారం తగ్గనుంది.

**ప్రభుత్వానికే 100 శాతం వాటా**

ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు కీలక విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో 100 శాతం యాజమాన్య వాటా పూర్తిగా ప్రభుత్వానికే బదిలీ అయినట్లు స్పష్టం చేశారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

**కనెక్టివిటీ పెంచడమే లక్ష్యం**

దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక ఇంజిన్‌లా మారుతోందని సీఎస్ పేర్కొన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# చిప్ నుంచి షిప్ వరకు... ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం

యువతకు అపార అవకాశాలు సృష్టిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడలో జరిగిన 'ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీపై ఆధారపడి ఉందని, దీన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా మారుస్తామని, క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తిని కూడా ఇక్కడే చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. యువత, విద్యాసంస్థలు ఈ నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నామని, విశాఖపట్నాన్ని ప్రపంచానికే డేటా సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. స్టీల్, అల్యూమినియం, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి కీలక పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. పుట్టపర్తి నుంచి బెంగళూరు వరకు డిఫెన్స్ కారిడార్‌గా, రాయలసీమను రూ.40 వేల కోట్ల పెట్టుబడితో ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఐదో తరం ఫైటర్ జెట్ యుద్ధ విమానాల టెస్టింగ్ ఫెసిలిటీని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సూర్యలంక, గండికోట వంటి పర్యాటక ప్రాంతాలను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన 'చిప్ టు షిప్' పిలుపునకు అనుగుణంగా రాష్ట్రంలో మాన్యుఫ్యాక్చరింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, పరిశ్రమలు వాస్తవ రూపంలో కార్యకలాపాలు ప్రారంభించేలా చూస్తున్నామని, 'సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్' తమ ప్రభుత్వ విధానమని పునరుద్ఘాటించారు. గత 23 నెలల్లో నెలకు రూ.లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామని ఆయన వెల్లడించారు. ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు తెలిపారు.

# రైతు గోస పట్టదా?

ఉండగా, ఇప్పటివరకు కేవలం 45 లక్షల టన్నులు సేకరించామని సీఎం పేర్కొంటున్నారని తెలిపారు. ఈ లెక్కన కూడా 30 శాతం మించలేదని మండిపడ్డారు.బీజేపీ శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి కాకుండానే, వారంలో కేంద్రాలను మూసేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని మండిపడ్డారు. అలా చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ బీజేపీ బస్సు యాత్ర వస్తుందని తెలిసి...కలెక్టర్ ఆదివారం గజ్వేల్ మార్కెట్ యార్డుకు ఆగమేఘాల మీద చేరుకొని లారీలు , గన్నీ బ్యాగులు తెప్పించే ప్రయత్నం చేశారని చెప్పారు. ఇదే ప్రయత్నం నిరంతరంగా ఎందుకు సాగటం లేదని ప్రశ్నించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలనకు ఐక్యతను చాటుతూ ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు బస్సులో బయలుదేరారు. ఈ బస్సు యాత్రలో ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్, పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యానారాయణగుప్తా, డా.పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, డా.సి.చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

హైదరాబాద్: రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రం మద్దతు ధరలు ప్రకటిస్తున్నప్పటికీ పంటలను మాత్రం పూర్తిస్థాయిలో కొనడం లేదని అన్నారు. సోమవారం సచివాలయంలో సీపీఎం రాష్ట్ర నాయకులు.. ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ నేతృత్వంలో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పండిన పంటలో 30 శాతం కూడా సేకరించడం లేదని విమర్శించారు. పంట కొనుగోళ్ల విషయంలో కేంద్రాన్ని ప్రశ్నించాలని వారికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగిస్తోందన్నారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నామని సీఎం చెప్పారు. బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత ఏర్పడిందని, ఎండ తీవ్రత వల్ల మధ్యాహ్న సమయంలో పనులు మందగిస్తున్నాయని పేర్కొన్నారు. మూసీ నిర్వాసితులకు అక్కడే ఇళ్లు..: కాగా, మూసీ నిర్వాసితులకు స్థానికంగానే ఇళ్లు మంజూరు చేస్తామని సీపీఎం నేతలకు సీఎం హామీ ఇచ్చారు.

# ప్రజల ప్రాణాల రక్షణ కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలి

## నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కు అల్లాడి మహేష్ విజ్ఞప్తి

**నిజాంపేట్, మే 25 (ప్రభాత సూర్య)2:** ప్రగతి నగర్ కాకతీయ హిల్స్ మరియు అలియాప్ సర్కిల్ వద్ద పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ప్రజల భద్రత కోసం వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని అల్లాడి మహేష్ గుప్తా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అల్లాడి మహేష్ గుప్తా మాట్లాడుతూ... కాకతీయ హిల్స్, అలియాప్ సర్కిల్ ప్రాంతాల్లో ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు, ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు మరియు వృద్ధులు తీవ్రమైన ట్రాఫిక్ మధ్య ప్రాణాలను పణంగా పెట్టుకుని రోడ్లు దాటాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతరం వాహనాల రాకపోకలతో ఈ ప్రాంతాలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ ప్రమాదాలు జరగకముందే మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని, ప్రజల ప్రాణాల రక్షణకు ప్రాధాన్యతనిస్తూ అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వుప్పల వంశీ కిషోర్ గుప్తా, పాంపాటి రాజేష్, సాయికిరణ్, నిజాం వంశీ తదితరులు పాల్గొన్నారు.



# సోమవారం ప్రజావాణిలో 80 ఫిర్యాదుల స్వీకరణ

మాదాపూర్ ప్రభాత సూర్య : సైబరాబాద్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సోమవారం ప్రజావాణి' కార్యక్రమంలో పౌరుల నుంచి మొత్తం 80 ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత విభాగాలు క్షుణ్ణంగా సమీక్షించాయి. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పారిశుధ్యం, రెవెన్యూ, విజిలెన్స్ తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను పౌరులు నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడీ కేటాయించి రశీదులు అందజేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు చేపట్టిన అధికారులు పెండింగ్ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో విభాగాల సమన్వయం పెంచుతూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలకు స్పష్టమైన మార్పు కనిపించేలా వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదుల సమర్థవంతమైన పరిష్కారం, నిరంతర



ఫాలోఅప్, పౌరుల సంతృప్తికి ప్రాధాన్యత ఇస్తూ సైబరాబాద్ వ్యాప్తంగా సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. 'సోమవారం ప్రజావాణి' ప్రజా సమస్యల త్వరిత పరిష్కారానికి, పారదర్శక పాలనకు కీలక వేదికగా కొనసాగుతోంది.




## వడదెబ్బకు మృతి చెందిన వేముల సైదమ్మా

**మాడుగుల పల్లి (మే 25) ప్రభాత సూర్య:** మాడుగుల పల్లి మండలం తోపుచర్ల గ్రామానికి చెందిన వేముల బక్కయ్యస తీమణి వేముల సైదమ్మ వయసు 45సం వడదెబ్బ కారణంగా హాస్పటల్లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది ఎండ సుమారు47 డిగ్రీలుగా ఉండగా ఎండ తీవ్రత తట్టుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.


## లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు

**తుర్కపల్లి, మే 25 ప్రభాతసూర్య :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొలత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ పుట్ట సాయిలు అన్నారు.సోమవారం తుర్కపల్లి మండలం గోపాలపురం, నాగాయపల్లి గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల దాన్యం తరలింపుకు లారీలు రావడం లేదని ,ఉన్నతాధికారులు స్పందించి లారీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో అక్రమ మట్టి లారీలను ఒక్కరోజు కేటాయిస్తే సెంటర్లో వడ్లను తగ్గించవచ్చని ఇట్టి సమస్యను అధికారులు త్వరగా స్పందించి పరిష్కరించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండబోయిన శ్రీశైలం దాసరి కొండల్, ఉడత రాజు, చిన్న రాజు చింటూ, లకావత్తు లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు



## మాదాపూర్‌లో విద్యుత్ వైర్లపై ప్రమాదకరంగా మారిన చెట్టు కొమ్మలు.....

**మాదాపూర్ ప్రభత సూర్య :** మాదాపూర్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మలు ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో ఈ సమస్యను బిఆర్ ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి రాయల కార్తీక్ విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన టిజి ఎస్పి డిసిఎల్ సీఎండి జితీష్ పటేల్, ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, డిఈ హనుమంత్ రెడ్డి, ఏడిఈ మల్లేశం ఏఈ లు, ఇతర అధికారులు సంబంధిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ వైర్ల మధ్యలో ఉన్న చెట్టు కొమ్మలను తక్షణమే తొలగించాలని అధికారులకు సీఎండి ఆదేశాలు జారీ చేశారు. అలాగే కొత్త పరికరాలను ప్రారంభించి, రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కరెంట్ షాక్ ప్రమాదాలు నివారించేందుకు రోడ్డుపక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గాలులు, వర్షాలు వచ్చే సమయంలో ప్రజలు విద్యుత్ వైర్ల క్రింద నిలబడవద్దని, విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని అధికారులు



హెచ్చరించారు. మాదాపూర్‌లో విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన టిజి ఎస్పి డిసిఎల్ సీఎండి జితీష్ పటేల్ కి రాయల కార్తీక్ అభినందనలు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని స్వయంగా పర్యటించి చర్యలు ప్రారంభించడంపై స్థానిక కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## గీతం కె.ఎస్.పి.పి.ని సత్కరించిన తెలంగాణ పోలీసు అకాడమీ

**కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ తరఫున జ్ఞాపికను స్వీకరించిన రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ**

**పటాన్చెరు, మే 25,ప్రభాత సూర్య :** వృత్తిపరమైన శిక్షణ, ప్రజా సేవ రంగాలలో 40 ఏళ్ల ఘనమైన సేవను పూర్తిచేసుకున్న సందర్భంగా, రాజా బహదూర్ వెంకట రామరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీ (ఆర్బీవీఆర్ఆర్ టీజీపీఏ) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కె.ఎస్.పి.పి.)ని ఒక స్మారక చిహ్నంతో సత్కరించింది. హైదరాబాదులోని తెలంగాణ పోలీసు అకాడమీ ప్రాంగణంలో



జరిగిన ఒక అధికారిక కార్యక్రమంలో, తెలంగాణ గౌరవ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ఈ స్మారక చిహ్నాన్ని గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, పూర్వ సంచాలకుడు పి.ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అకాడమీ తాము కొనసాగిస్తున్న విద్యాపరమైన సహకారాలు, సంస్థాగత భాగస్వామ్యాలను గుర్తించి, యునిసెఫ్, ఐఐటీ హైదరాబాదు, జేఎన్టీయూ హైదరాబాదు, తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ వంటి పలు ప్రముఖ సంస్థలను కూడా సత్కరించింది. సుపరిపాలన, విధాన విద్య, పరిశోధన, నాయకత్వ అభివృద్ధి, సామర్థ్య నిర్మాణం వంటి అంశాలను ప్రోత్సహించడంలో విద్యా సంస్థలకు, ప్రజా సేవా సంస్థలకు మధ్య పెరుగుతున్న సమన్వయాన్ని ఈ కార్యక్రమం ప్రత్యేకంగా చాటి చెప్పింది. సమాజ, సంస్థాగత పురోగతికి దోహదపడే అర్థవంతమైన సహకారాలను పెంపొందించడంలో కె.ఎస్.పి.పి.కి ఉన్న నిబద్ధతను ఈ సన్మానం మరింత బలోపేతం చేసింది.



## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత.......

**ప్రభాత సూర్య చండూర్:** సోమవారం రోజున స్థానిక ప్రభుత్వ అతిథి గృహం నందు 3,85,500/- రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ మరియు కౌన్సిలర్లు కలిసి 13 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తుందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కృషితో అనేకమంది పేద కుటుంబాలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రయోజనం పొందుతున్నాయని అన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి సుష్మా వెంకన్న, బుషిపాక వాసు, కటకం రమేష్, కో ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య, ఖలీల్, మొగుదాల వెంకన్న, షరీఫ్, ఐతరాజు మల్లేష్,బోడ వెంకటేష్, నల్ల సత్యనారాయణ, ఇరిగి వెంకటేశం, పన్నాలు లింగయ్య,పందుల సత్యం, గంట యాదయ్య,మాస కృష్ణ, జూలూరు వెంకటేశం,లతీఫ్, ఏకాలపు ఆంజనేయులు, ఇరిగి శంకర్, రావిరాల రాజు, బుషిపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## శామ్‌సంగ్‌కు భారత్‌లో 30 ఏళ్ల సేవా ప్రయాణం...



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** భారతదేశంలో కస్టమర్ సేవా రంగంలో 30 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న శామ్‌సంగ్, చిన్న సేవా కేంద్రం నుంచి దేశవ్యాప్తంగా విస్తరించిన అతిపెద్ద డిజిటల్ సేవా వ్యవస్థగా ఎదిగిందని ప్రకటించింది. 1996లో ఢిల్లీలో తొలి సర్వీస్ సెంటర్‌తో ప్రారంభమైన ఈ ప్రయాణం, చేతితో రాసే ఫిర్యాదు రిజిస్టర్లు, పేజర్ల నుంచి నేడు ఏఐ ఆధారిత డయాగ్నస్టిక్స్, కనెక్టెడ్ కేర్ సేవల వరకు విస్తరించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,000కు పైగా సర్వీస్ టచ్‌పాయింట్లు, 12,500కు పైగా ఇంజినీర్లతో శామ్‌సంగ్ సేవలందిస్తోంది. స్మార్ట్ థింగ్స్ ఆధారిత ప్రోయాక్టివ్ కేర్ ద్వారా గృహోపకరణాల్లో లోపాలను ముందుగానే గుర్తించి వినియోగదారులకు సమాచారం అందించే సదుపాయం అందుబాటులో ఉంది. అలాగే వాట్సాప్ సహాయం, రిమోట్ డయాగ్నస్టిక్స్, ఆన్‌లైన్ బుకింగ్, 10 భారతీయ భాషల్లో వాయిస్ సపోర్ట్ వంటి సేవలతో వినియోగదారులకు మరింత చేరువైంది. దోస్త్ సర్వీస్ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా వేలాది మంది సర్వీస్ ఇంజినీర్లకు శిక్షణ అందించడంతో పాటు, ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇస్తోంది. కస్టమర్ విశ్వాసాన్ని కేంద్రంగా చేసుకుని సాంకేతికతతో కూడిన వేగవంతమైన, పారదర్శకమైన సేవలందించడం తమ లక్ష్యమని సంస్థ తెలిపింది.

## అంజయ్య నగర్ డివిజన్ లో ఎత్తైన ప్రాంతాలకు బూస్టర్ మోటార్లు ఏర్పాటు చేయాలి : ఆంజనేయులు సాగర్..

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :**అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని ఉన్న అంజయ్య నగర్, సిద్ధికి నగర్, రాజీవ్ నగర్, పీజేఆర్ నగర్, గుల్షన్ నగర్, బస్తీలో ఎత్తైన ప్రాంతాలు కొన్ని ఉండడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలకు మంచినీటి సరఫరా సరిగా అందడం లేదు. ముఖ్యంగా వేసవికాలంలో తీవ్ర ఎండల కారణంగా నీటి అవసరం పెరగడంతో ప్రజలు రోజువారీ పనులు, మిగతా కార్యక్రమాలు నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక ప్రజలు అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ జనరల్ మేనేజర్ హరి శంకర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు.దీనిపై స్పందించిన జనరల్ మేనేజర్ జూన్ 20 తర్వాత బూస్టర్ మోటార్ ఏర్పాటు చేసి నీటి ప్రెజర్ పెంచే చర్యలు తీసుకుంటామని, అలాగే పాత పైప్‌లైన్లను కూడా మార్చుతామని హామీ ఇచ్చారు. దీంతో ఎత్తైన ప్రదేశాల్లో ఉన్న ప్రజలకు మంచినీటి సమస్య కొంతమేరకు పరిష్కారం అవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ సాగర్, సుబ్బయ్య, మురళి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక పినపాక నియోజకవర్గం కన్వీనర్ గా ప్రసాద్



**ఖమ్మం (ప్రభాత సూర్య ప్రతినిధి ):** తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక పినపాక నియోజకవర్గం కన్వీనర్ గా కొక్కొండ ప్రసాద్ ని నియమించినట్లు తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భట్టు రాజేందర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వెంటనే వారికి పెన్షన్ 250 గజాల ఇంటి స్థలం మంజూరు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి...



**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువు మెట్రో స్టేషన్ పక్కన ఆదివారం మధ్యాహ్నం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మధ్యాహ్నం ఒంటి గంటకు ముందు ఓ వ్యక్తి అక్కడ స్పృహ తప్పి పడి ఉన్నాడని సమాచారం అందడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం అతడిని అంబులెన్స్‌లో కొండాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఫిట్స్, అనారోగ్యం లేదా వడదెబ్బ కారణంగా మృతి జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతుడు యాష్ కలర్ ఫుల్ షర్ట్, యాష్ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. నల్లటి జుట్టు, చిన్న గడ్డం ఉండగా, రెండు కళ్లు తెరిచి ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. స్థానికులను విచారించగా అతడు చెత్త కాగితాలు ఏరుకునే వ్యక్తిగా అప్పుడప్పుడు కనిపించేవాడని, 'యేసు' అని పిలుస్తుండేవారని తెలిపారు. మృతుడి గురించి ఎవరికైనా వివరాలు తెలిసి ఉంటే మాదాపూర్ పోలీస్ స్టేషన్ నంబర్ 8712663109 లేదా SHO 8712663100, ASI 8712567299 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## మే 27 నుంచి పాలిసెట్ కౌన్సిలింగ్ ప్రారంభం అవుతున్నది కావున రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల రీయంబర్స్మెంట్ పై స్పష్టత ఇచ్చిన తర్వాతనే కౌన్సిలింగ్ నిర్వహించాలి

ఫీజుల రీయంబర్స్మెంట్ పై స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వం కౌన్సిలింగ్ చేపట్టడం సరికాదు

పాత పద్ధతిలోనే ఫీజుల రీయంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయాలి.

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్



**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 25)ప్రతినిధి :** ఫీజుల రీయంబర్స్మెంట్ పథకశీ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత లేకుండానే ఈనెల 27వ తేదీ నుండి పాలిసెట్ కౌన్సిలింగ్ చేపడుతుందని,పాత పద్ధతి ప్రకారమే ఫీజుల రీయంబర్స్మెంట్ ను అమలు చేస్తామని ప్రకటించిన తర్వాతనే కౌన్సిలింగ్ చేపట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు విడుదల చేయకుండా గత ప్రభుత్వశీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని,కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయంబర్స్మెంట్ పథకాన్నీ నీరుగార్చే విధంగా వ్యహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బంటు వారి గూడెంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను అనర్హులకు పంపిణీ కలెక్టర్ కి వినతి- మెరుగు రామలింగయ్య

### నిడమనూరు మండల ఎమ్మార్వో పై చర్యలు తీసుకోవాలి



**నల్గొండ ప్రభాత సూర్య:** ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మెరుగు రామలింగయ్య తండ్రి అయ్యన్న కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. బంటు వారి గూడెంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అనర్హులకు అనగా గుండెబోయిన అనూష గత నాలుగు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది కానీ 16. 05. 2025 నాడు దరఖాస్తు చేసుకున్నది. 05.05.2026 నాడు కళ్యాణ లక్ష్మి చెక్కు తీసుకున్నది. ఈమెకు మూడు సంవత్సరాల కుమారుడు కూడా ఉన్నాడు. గుండెబోయిన శివాని ఈమెకు 7 సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది 26.07.2025 నాడు దరఖాస్తు చేసుకున్నది. 05.05.2026 కళ్యాణ లక్ష్మి చెక్కు తీసుకున్నది. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు 4 సంవత్సరాలు,3 సంవత్సరాలు కుమారులు ఉన్నారు. గుండెబోయిన నందిని ఈమెకు మూడు సంవత్సరాలు క్రితం వివాహం అయింది0 7.04.2026 నాడు దరఖాస్తు చేసుకున్నారు సాంక్షన్ లిస్టులో ఈమె పేరు ఉన్నది. ఈమెకు 2 సంవత్సరాల కూతురు ఉన్నది. ఇలా ఉండగా అధికార పార్టీకి చెందిన అనర్హుల కు తహసీల్దార్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. కానీ అర్హులైన కొంతమందికి మాత్రం చెక్కులు పంపిణీ చేయకుండా తహసీల్దార్ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కావున వెంటనే ఇట్టి కళ్యాణ లక్ష్మి చెక్కులపై విచారణ జరిపి అవినీతికి పాల్పడిన అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని బంటు వారి గూడెం గ్రామం, నిడమనూరు మండల అర్హులకు న్యాయం చేయగలరని కోరారు.

# రంగారెడ్డి కోహెడలో భూ బాధితుల ఆందోళన







**ఇబ్రహీంపట్నం ప్రభాత సూర్య ప్రతినిధి: మే 25:** ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ పరిధిలోని కోహెడ సర్వేనెంబర్ 167/1 లో కోహెడ గ్రామానికి చెందిన ముదిరాజ్ కుటుంబ సభ్యులు దాదాపు 70 ఏళ్ల నుంచి భూమి సాగు చేసుకుంటున్నారు. ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ పరిధిలోని కోహెడ సర్వేనెంబర్ 167/1 లో కోహెడ గ్రామానికి చెందిన ముదిరాజ్ కుటుంబ సభ్యులు దాదాపు 70 ఏళ్ల నుంచి భూమి సాగు చేసుకుంటున్నారు. 39 ఎకరాల ఎక్సాల్ పట్టా భూమిలో 49 మంది రైతులు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ స్థలంలో గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. జూన్ మూడో తేదీన ఈ స్థలంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కు శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేస్తుండడంతో సోమవారం అబ్దుల్లాపూర్ మెట్ రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తుతో జెసిబిలను ఏర్పాటు చేసి భూమిని చదును చేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయమై గ్రామస్తులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అధికారులకు, రైతులకు వాగ్వాదం జరిగింది. అనంతరం కోహెడ రైతులు తమకు చెందిన భూమిలో పోలీసు బందోబస్తుతో జెసిబి లను పెట్టి ఎలా పనులు చేపడుతున్నారని కోహెడ గ్రామస్తులు ఆందోళనలు చేపట్టారు. రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రెవెన్యూ అధికారులను అడ్డుకున్న కోహెడ భూ బాధితులు ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, ఎల్బీనగర్ డిసిపి అనురాధ, అడిషనల్ డిసిపి పాల్గొన్నారు.

# కరెంటు మెరుపుతో వరి చేను దగ్ధం.. రైతుకు రూ.50 వేల నష్టం..





**ఆలేరు మే 25 ప్రభాత సూర్య :** ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో కరెంటు మెరుపు కారణంగా వరి చేను దగ్ధమై రైతుకు భారీ నష్టం వాటిల్లింది. రైతు గంగరాజు రామకృష్ణకు చెందిన వరి పంట ఒక్కసారిగా మంటలకు ఆహుతై సుమారు 50 బస్తాల దిగుబడి నష్టం జరిగినట్లు తెలిపారు. ఈ ఘటనతో రైతుకు దాదాపు రూ. 50 వేల మేర ఆర్థిక నష్టం సంభవించినట్లు తెలుస్తోంది.పంట నష్టం కారణంగా తీవ్ర ఆవేదనకు గురైన రైతు గంగరాజు రామకృష్ణ కన్నీళ్లతో తన బాధను వ్యక్తం చేశారు. ఇప్పటికే వ్యవసాయ ఖర్చులు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఈ ప్రమాదం మరింత కష్టాల్లోకి నెట్టిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఘటనపై అధికారులు పరిశీలన జరిపి తగిన నష్టపరిహారం అందించాలని కోరారు. స్థానిక రైతులు కూడా బాధిత రైతుకు ప్రభుత్వం అండగా నిలిచి నష్టపరిహారం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కరెంటు మెరుపుల వల్ల పంటలకు నష్టం జరగకుండా సంబంధిత శాఖలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# దున్నే వారికే భూమి కావాలని గర్జించిన రణ నినాదమే నక్సల్బరీ..

## ఆర్ జనార్ధన్ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కమిటీ జిల్లా కార్యదర్శి..



**ఆలేరు మే 25 ప్రభాత సూర్య:** 1967 లో నక్సల్బరీ అనే చిన్న గ్రామంలో దున్నే వారికే భూమి కావాలనే రణ నినాదంతో మొదలైన నక్సల్బరీ పోరాటం తరంగమై,ఉప్పొంగే ప్రవాహమై,ప్రజా విముక్తికి మార్గాన్ని అందించిందని, నక్సల్బరీ మార్గమే భారత దళారి,దోపిడీ వ్యవస్థను నాశనం చేస్తుందని,అంతిమంగా ప్రజలకు ప్రత్యామ్నాయం,నూతన ప్రజాస్వామిక విప్లవం ను సాకారం చేస్తుందని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ అన్నారు. నక్సల్బరీ ఆవిర్భావ 59 వ వార్షికోత్సవం సందర్భంగా సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ,1941- 56 వరకు సాగిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కు నాడు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకత్వం ద్రోహం చేస్తే,అనతికాలంలోనే తిరిగి పశ్చిమ బెంగాల్ లో నక్సల్బరీ లో కామ్రేడ్ చారు మజుందార్,కానుసైన్యాల్, చెంగల్ సంతాల్ తదితరుల నాయకత్వంలో రైతులు,గిరిజనులు, ఆదివాసీలు ఉరుములై, మెరుపులై చేతికి అందిన సాంప్రదాయ ఆయుధాల నుండి మొదలుకొని ఆయుధాలతో దేశంలో ప్రజా విముక్తికి దారులు వేశారని,ఒక్క నక్సల్బరీ లో ప్రారంభమైన నక్సలైట్ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడిందని,శ్రీకాకుళం రైతాంగ,గిరిజన పోరాటంగా మారి గోదావరిలోయలో పరవళ్ళు తొక్కిందని,లక్షలాది భూస్వాముల,అటవీ భూములను ప్రజలు స్వాదీనం చేసుకొని నేటికీ అనుభవిస్తున్నారని అన్నారు. ఇలాంటి పోరాటాలు భవిష్యత్ లో బీ జే పీ ఇంకా ఇంకా చవిచూడాల్సి ఉంటుందని,మీ పతనం ప్రారంభం అయిందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కళ్లెపు అడివయ్య,జిల్లా ఉపాధ్యక్షులు చిరబోయిన రాజయ్య, పీ వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్,మరియు ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వంగాల మధుసూదన్ రెడ్డి ఐ ఎఫ్ టి యు జిల్లా సహాయ కార్యదర్శి ఊరడి రామచంద్రు,పీ వై ఎల్ జిల్లా నాయకులు కళ్లెపు నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిని ఇంటి నుంచి గెంటేసిన కొడుకు, కోడండ్లు పై కలెక్టర్ కి వినతి



**నల్గొండ ప్రభాత సూర్య:** ప్రజావాణిలో భాగంగా సోమవారం నల్గొండ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కు మేకల లక్ష్మమ్మను అను నన్ను ఇంటి నుంచి గెంటేసిన కొడుకు, కోడండ్లు పై కలెక్టర్ కి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. పై విషయాన్నిసారం తెలియజేయునది ఏమనగా నేను మేకల లక్ష్మమ్మ, డిండి మండలం, చెరుకుపల్లి గ్రామం, నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నా కుమారుడు, భర్త చనిపోయారు. నేను అచేతన స్థితి, వృద్ధాప్యం లో ఉన్నాను. నా యొక్క బాగోగులు ఆలన పాలన చూసుకోవాల్సింది నా కుమారుడు, నా యొక్క కోడళ్లు అని తెలిపారు. కానీ కొన్ని రోజుల నుండి ఇంటి నుండి నన్ను గెంటివేసి చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నా ఆస్తులను కూడా పంపిణీ చేశాను. ప్రస్తుతం నా యొక్క కుమార్తె దగ్గర తలదాచుకొని ఉంటున్నాను. నేను నా కన్నీళ్ళతో పిల్లల్ని పెంచి ఇప్పుడు వృద్ధాప్యంలో డబ్బు, ఆస్తుల కోసం ప్రేమానురాగాలు విలువలు తగ్గిపోయాయి ఒంటరిగా మిగిలాను కావున ఉన్నత అధికారులు కొడుకు, కోడళ్ళ పై ఇంటి నుండి గెంటివేత పై విచారణ జరిపించి వారే నా యొక్క బాగోవులు, చూసుకోవాలని ఇట్టి విషయంపై విచారణ జరిపించి నాకు న్యాయం చేయగలరని కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు.





# ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి అనుబంధ సంఘాల గ్రామ కార్య వర్గ సమావేశం...నూతన గ్రామ కమిటీ ఎన్నిక..

**ఆలేరు మే 25 ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం లోని గొలనుకొండ గ్రామంలో మాతమ్మ దేవాలయ ఆవరణలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి అనుబంధ సంఘాల గ్రామ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు భైరపాక బెంజిమెన్ మాదిగ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎం ఎస్ పి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఆలేరు మండల ఇంచార్జీ నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఆలేరు మండల కో ఇంచార్జీ కందుల నర్సింగ్ రావు మాదిగ లులి హాజరై మాట్లాడుతూ 31 సంవత్సరాల పాటు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కొరకు పోరాడి సాధించుకోవడం జరిగిందని, ఇప్పుడు అట్టి ఫలాలను ప్రస్తుతం సెలవుల సందర్భంగా గ్రామాలలో ఉన్న ప్రతి విద్యార్థి చదువుకొని వర్గీకరణ ఫలాలు పొందే విధంగా గ్రామాలకు తరలివెళ్లి చైతన్య పరచాలని మరియు జూలై 7న జరగబోయే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామ గ్రామన మాదిగల ఆత్మగౌరవ పతాక ఎమ్మార్పీఎస్ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గొలనుకొండ గ్రామ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి గ్రామ శాఖలు ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. గొలనుకొండ నూతన ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు తాండ్ర సుధాకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి భైరపాక సందీప్ మాదిగ అధికార ప్రతినిధి గందమళ్ళ ప్రసాద్ మాదిగ,ఉపాధ్యక్షులు మారుపల్లి రజనికాంత్ మాదిగ, కార్యదర్శి భువనగిరి అయోధ్య మాదిగ, సహాయ కార్యదర్శి భైరపాక ప్రకాష్ మాదిగ, కార్యవర్గ సభ్యులుగా ఎరుకల భాస్కర్ మాదిగ,మారుపల్లి శ్రీకాంత్ మాదిగ,భైరపాక గణేష్ మాదిగ,చిట్యాల హరి మాదిగ సలహాదారులు గా ఎరుకల అశోక్ మాదిగ, గుజ్జుం రాంచందర్ మాదిగ లు ఎన్నికయ్యారు. అలాగె గొలనుకొండ ఎంఎస్పి గ్రామ శాఖ నూతన కమిటీ అధ్యక్షులు బాకీ రాములు మాదిగ, ప్రధాన కార్యదర్శి చందేపల్లి ఆనంద్ మాదిగ ఉపాధ్యక్షులు సుంచు అలెగ్జాండర్ మాదిగ, కార్యవర్గ సభ్యులుగా ముస్త్యాల మల్లయ్య మాదిగ,కాండ్రు ప్రభాకర్ మాదిగ,చందేపల్లి అశోక్ మాదిగ,మారుపల్లి పాండు మాదిగ,మారుపల్లి ప్రవీన్ మాదిగ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఆలేరు మండల ఇంచార్జీ నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు ఆలేరు మండల కో ఇంచార్జీ కందుల నర్సింగ్ రావు మాదిగ,

సీనియర్ ఎమ్మార్పియస్ నాయకులు భైరపాక బెంజిమెన్ మాదిగ, బాకీ రాములు మాదిగ, చందేపల్లి ఆనంద్ మాదిగ,సుంచు అలెగ్జాండర్ మాదిగ,ముస్త్యాల మల్లయ్య మాదిగ,కాండ్రు ప్రభాకర్ మాదిగ,చందేపల్లి అశోక్ మాదిగ,మారుపల్లి పాండు మాదిగ,మారుపల్లి ప్రవీన్ మాదిగ,తాండ్ర సుధాకర్ మాదిగ,భైరపాక సందీప్ మాదిగ,గందమళ్ళ ప్రసాద్ మాదిగ,మారుపల్లి రజనికాంత్ మాదిగ,భువనగిరి అయోధ్య మాదిగ ,భైరపాక ప్రకాష్ మాదిగ,ఎరుకల భాస్కర్ మాదిగ,మారుపల్లి శ్రీకాంత్ మాదిగ, భైరపాక గణేష్ మాదిగ,చిట్యాల హరి మాదిగ సలహాదారులు గా ఎరుకల అశోక్ మాదిగ, గుజ్జుం రాంచందర్ మాదిగ లు ఎన్నికయ్యారు.





# ప్రజా సంక్షేమమే మా లక్ష్యం

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ..45 మంది లబ్ధిదారులకు 20 లక్షల 81 వేల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**పటాన్చెరు, మే 25,ప్రభాత సూర్య :** నియోజకవర్గ ప్రజల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని భారతరత్న పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలు, డివిజన్లకు సంబంధించిన 45 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 20 లక్షల 81 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందని తెలిపారు. దీని ద్వారా ప్రతి నెల లక్షలాది రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసిలు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, అంతిరెడ్డి, పరమేష్ యాదవ్, రామచందర్, ఖదీర్, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## సిరిపురం గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం.

**ప్రభాత సూర్య నర్సాపూర్ మే 25 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సిరిపురం గ్రామంలో నూతనంగా ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రజలు కొత్త ఆధార్ నమోదు, ఆధార్ సవరణలు, మొబైల్ నెంబర్ లింక్, బయోమెట్రిక్ అప్డేట్ వంటి సేవలను పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. అయితే ఈ ఆధార్ కేంద్రం ద్వారా సిరిపురం గ్రామం తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కూడా సౌకర్యవంతమైన సేవలు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఆధార్ కేంద్రం ప్రొప్రైటర్ ఎల్ రామచంద్ర రెడ్డి, ఆపరేటర్ పూల సౌమ్య ఈ సేవలను అందించనున్నారని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిర్పుర మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, పుట్టి వీరేశం, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, చెన్న నరసింహులు, పెద్ద గొల్ల శ్రీనివాస్ , విజేందర్ రెడ్డి, పూల శంకర్, కాలే ఆగం, మైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొని నిర్వహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# ప్రశాంతంగా జంగారెడ్డిగూడెంలో ముగిసిన ధాన్యం కొనుగోలు



## 68 లారీల ధాన్యం సేకరణ

**నల్గొండ ప్రభాత సూర్య:** తిప్పర్తి మండలం, జంగారెడ్డిగూడెం ఐకెపి కేంద్రం. ధాన్యం సేకరణ ఈ కేంద్రం ద్వారా యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. మొత్తం 68 లారీల ధాన్యాన్ని సేకరించారు. ఐకెపి సెంటర్ ఇన్‌చార్జ్ దాసరి రవీందర్ ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. లారీల కొరత ఉన్నా వేగంగా కొనుగోళ్లు గత సీజన్‌తో పోలిస్తే ఈసారి ధాన్యం దిగుబడి చాలా ఎక్కువగా వచ్చింది. దీనివల్ల మధ్యలో కొంత లారీల కొరత వచ్చినా, రైతులకు ఎలాంటి నష్టం లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అత్యంత వేగంగా ధాన్యాన్ని సేకరించామని దాసరి రవీందర్ చెప్పారు. ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన ఉన్నతాధికారులకురైస్ మిల్లర్లకు, లారీ యజమానులకు, ఐకెపి సిబ్బందికి మరియు రైతు సోదరులకు ఇన్‌చార్జ్ దాసరి రవీందర్ కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు నష్టం లేకుండా వేగవంతంగా ప్రక్రియ పూర్తి సహకరించిన అందరికీ ఐకేపీ సెంటర్ ఇన్‌చార్జ్ దాసరి రవీందర్ జంగారెడ్డిగూడెంలో లారీల కొరత ఉన్న మధ్యలో వచ్చినా రైతులకు ఇబ్బంది లేకుండా 68 లారీల ధాన్యం సేకరణ పూర్తి చేశామని తెలిపారు.



## మహిళా సాధికారత వైపు మరో అడుగు

గట్టుపల్ ప్రభాత సూర్య మే25:గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో, నేడు మన గ్రామంలో రెండవ మహిళా సంఘం భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో, ఈ భవన నిర్మాణానికి శుభారంభం చేయడం ఎంతో సంతోషకరం. మహిళల ప్రగతికి, వారి స్వయం ఉపాధికి ఈ భవనం ఒక గొప్ప వేదిక కానుంది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రావుల స్వప్న రమేష్ ఉప సర్పంచ్, గంగనబోయిన మహేష్.కార్యదర్శి , వార్డ్ మెంబర్లు, ఊాలు, అంగన్‌వాడీ టీచర్లు మరియు ఆశా వర్కర్లు, మహిళా సంఘం సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఎన్ఓసి మంజూరి పత్రం అందజేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన: భీమనపల్లి యల్లమ్మ




**నల్గొండ ప్రభాత సూర్య:** ప్రజావాణిలో భాగంగా సోమవారం నల్గొండ కలెక్టర్ కార్యాలయం ముందు భీమనపల్లి యల్లమ్మ భర్త రామస్వామి, గ్రామం వెల్మకన్నె, మండలం గట్టుప్పల్, అనువారు కుటుంబ సభ్యులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2001 సంవత్సరంలో అప్పటి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దళితులకు రెండెకరాల భూమిని కేటాయించారు. ఈ రెండు ఎకరాల భూమికి 26,000 ఆర్థిక సహాయ మంజూరి పత్రం ఇచ్చారు. అప్పటి ప్రభుత్వం యొక్క భూమికి ఈఎంఐ రూపంలో సబ్సిడీ కింద డబ్బులు కట్టుకునే విధంగా సౌకర్యం కల్పించారు. దీనికి భూమికి పూర్తిగా డబ్బులు కట్టాను.2009 సంవత్సరంలో రుణమాఫీ కూడా జరిగింది. కానీ నా పేరు మీద ఉన్న భూమిని నా యొక్క కుమారుడైన భీమనపల్లి రాజుకు సేల్ డీడ్ రూపంలో పట్టచేయాలనుకుంటున్నాను. కానీ ఎమ్మార్వో, ఎన్ఓసి సర్టిఫికెట్ ఉండాలని అది ఉంటేనే సేల్ డీడ్ గా మార్చుతాను అని తెలిపారు. ఎమ్మార్వో ను ఎన్ఓసీ సర్టిఫికెట్ను పలుమార్లు అడగగా నిర్లక్ష్య వైఖరి ధోరణితో నేను కాదు షెడ్యూల్ కాస్ట్ అధికారులు మంజూరు చేస్తారని, ఇట్టి విషయంపై షెడ్యూల్ కాస్ట్ అధికారులను అడగగా నాకు సంబంధం లేదు ఎమ్మార్వోనే బాధ్యులని తెలిపారు. గత సంవత్సరాల నుండి మా కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై కలెక్టర్ కు వినతి పత్రం అందజేసి ఎన్ఓసి సర్టిఫికెట్ కలెక్టర్ ఇప్పించి న్యాయం చేయగలరని తెలిపారు. కార్యక్రమంలో భీమనపల్లి రాజు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## త్రాగు నీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

**కృతజ్ఞతలు తెలిపిన పల్ప నూర్ గ్రామ ప్రజలు**



**ప్రభాత సూర్య నర్సాపూర్ మే25:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పల్పనూరు గ్రామంలో గత కొన్ని నెలలుగా త్రాగునీటి సమస్యతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో రోజు రోజుకు పెరుగుతున్న జనాభా నేపథ్యం ,దానికి తోడు మిషన్ భగీరథ నీరు సరిగా రాకపోవడంతో త్రాగునీటి సమస్య ఏర్పడి గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.అందులో ను వేసవి కాలం కావడం తో ప్రజలు నానా యాతన పడుతున్నారు.త్రాగు నీటి సమస్య పరిష్కారానికై స్తానిక సర్పంచ్ బంటు రాయుడు,ఉప సర్పంచ్ అన్న పూర్ణ,మాజీ సర్పంచ్ బంటు శ్రీనివాస్ లు స్తానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు.వెంటనే ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి స్పందించి సోమవారం బోరు బావి వేయించారు.త్రాగునీటి కి సరిపడ నీరు పడడంతో గ్రామ సర్పంచ్ బంటు రాయుడు తో పాటు గ్రామ పంచాయతీ పాలకవర్గం ,గ్రామప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద గొల్ల కిష్టయ్య,కుల్పగురి లక్ష్మణ్,బంటు మల్లేశం,వడ్డే దశరథ , సతీ రెడ్డి,గ్రామ ప్రజలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.



రజక,ముదిరాజ్ కమ్యూనిటీ భవనాలను ప్రారంభించిన

## మునుగోడు ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి



**సంస్థాన్ నారాయణపురం, మే 25(ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ముదిరాజ్ ,రజక సంఘ కమ్యూనిటీ నూతన భవనాలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి తో కలిసి సంస్థాన్ నారాయణపురం అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వివిధ అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్త ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, నారాయణపురం వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

సిట్ ముందుకు సీఎం రేవంత్ సన్నిహితుడు

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుడికి సిట్ నోటీసులు

నేడు విచారణకు హాజరుకానున్న కొడంగల్ కాంగ్రెస్ నేత శ్రీరాం రెడ్డి



తెలంగాణను రాజకీయంగా కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన అనుచరుడు, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత శ్రీరాం రెడ్డికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. నోటీసుల మేరకు ఆయన సోమవారం బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిట్ అధికారుల ముందు విచారణకు హాజరుకానున్నారు. దౌల్తాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా ఉన్న శ్రీరాం రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు తిరుపతి రెడ్డికి అత్యంత నమ్మకస్తుడిగా పేరుపొందారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఇంటెలిజెన్స్ విభాగం, రేవంత్ రెడ్డి కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు శ్రీరాం రెడ్డి ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు సిట్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహాలు, ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడమే లక్ష్యంగా ఈ ట్యాపింగ్ జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీరాం రెడ్డి ఫోన్‌ను ఏయే కాలాల్లో ట్యాప్ చేశారు, ఎవరెవరితో జరిపిన సంభాషణలను రికార్డ్ చేశారు వంటి సాంకేతిక అంశాలపై సిట్ అధికారులు ఆయనను ప్రశ్నించనున్నారు. విచారణలో భాగంగా శ్రీరాం రెడ్డి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేయడంతో పాటు, ఆయన మొబైల్ ఫోన్లు, కాల్ డేటా రికార్డులను కూడా పరిశీలించనున్నట్లు తెలుస్తోంది.

## హైకోర్టు న్యాయవాది హత్య కేసులో కొత్త విషయాలు

రూ.10 లక్షల సుపారీతో న్యాయవాది మొయినుద్దీన్ హత్య

వినయ్ గ్యాంగ్‌తో హత్యకు ఒప్పందం కుదుర్చుకున్న కిషన్

కారుతో ఢీకొట్టి 20 మీటర్లు లాక్కెళ్లి కిరాతకంగా హత్య

హత్య వెనుక వక్ఫ్ భూముల వివాదం ఉన్నట్లు అనుమానం

తెలంగాణ హైకోర్టు న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది రూ.10 లక్షల సుపారీ ఇచ్చి చేయించిన హత్య అని పోలీసుల దర్యాప్తులో తేలింది. కిషన్ అనే వ్యక్తి ద్వారా వినయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ముఠాతో ఈ హత్యకు ఒప్పందం కుదిరినట్లు పోలీసులు గుర్తించారు.ఈ హత్య కోసం నిందితులు ఆరు నెలల క్రితమే సెకండ్‌హ్యాండ్ కారును కొనుగోలు చేశారు. న్యాయవాది కదలికలపై చాలాసార్లు రెక్కీ నిర్వహించారు. చివరకు ఆయన ఇంటి వద్దే కారుతో ఢీకొట్టి, సుమారు 20 మీటర్ల దూరం లాక్కెళ్లి కిరాతకంగా చంపేశారు. ఈ దారుణ దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో స్పష్టంగా రికార్డయ్యాయి.వక్ఫ్ భూముల వివాదమే ఈ హత్యకు ప్రధాన కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ప్రధాన అనుమానితుడైన వినయ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటన తర్వాత నిందితులు గోవా, కల్వకుర్తికి పారిపోగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు మంచిది కాదు..

ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలి..

హమాలీలు, లారీల కొరత నివారించాలి..

జిన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్..





**జిన్నారం, మే 25,ప్రభాత సూర్య :** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. వర్షాకాలం ఆరంభమయ్యే సమయం ఆసన్నమైనప్పటికీ ధాన్యం కొనుగోలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుందని. అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు ప్రభుత్వానికి మంచిది కాదని.. వెంటనే కొనుగోళ్ళు ప్రారంభించాలని పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిన్నారం, సోలక్పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల అంశంలో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు వివరించారు. కష్టనష్టాలను ఎదుర్కొని ధాన్యం పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వస్తే.. అధికారుల నిర్లక్ష్యం మూలంగా గత 15 రోజులుగా కొనుగోలు చేయకపోవడం మూలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు కన్నీటి పర్యంతమయ్యారు. వర్షాలు ఎప్పుడు వస్తాయన్న భయాందోళనతో ప్రతిరోజు ధాన్యాన్ని కాపాడుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గత పది సంవత్సరాల పాటు రాష్ట్రంలోని రైతాంగానికి స్వర్ణయుగం నడిచిందని న్నారు. రైతుకి రైతుబంధు, రైతు భీమా, సాగునీరు, పండించిన ప్రతి పంటకు మద్దతు ధర, సకాలంలో కొనుగోళ్లు చేయడంతో పాటు వెంటనే డబ్బులు సైతం డిపాజిట్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో వ్యవసాయం అంతంత మాత్రమే ఉందని.. పండించిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మరో వారం రోజుల్లో రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయం ఆసన్నమైనప్పటికిని.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులు అలాగే ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అర్థం పడుతుందని అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు ప్రభుత్వానికి మంచిది కాదని ప్రభుత్వానికి సూచించారు. రవాణా, హమాలీలు, గన్ని బ్యాగుల కొరత పేరుతో రైతులను ఇబ్బందులకు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ రోజు నుండే ధాన్య కొనుగోలు చేపట్టాలని జిల్లా పౌరసరఫల శాఖ అధికారికి ఫోన్ లో సూచించారు. రాబోయే రెండు రోజుల్లో నియోజకవర్గంలో రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేయడంతోపాటు.. ఇందుకు సంబంధించిన డబ్బులు సైతం డిపాజిట్ చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కార్మికుల సమ్మె విరమణకు ఎమ్మెల్యే హామీ

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గూడెం మహిపాల్ రెడ్డి భరోసా





**పటాన్చెరు, మే 25,ప్రభాత సూర్య :** పటాన్‌చెరు పట్టణంలోని ఫ్రీడమ్ పార్క్ వద్ద సెంట్రింగ్ కార్మికుల సమ్మె విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గత పది రోజులుగా జిహెచ్ఎంసి పరిధిలోని సెంట్రింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె విజయవంతంగా కొనసాగిన అనంతరం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి భద్రత, కార్మిక సంక్షేమం, పెరుగుతున్న నిర్మాణ వ్యయాలకు అనుగుణంగా వేతనాల పెంపు వంటి డిమాండ్లతో కార్మికులు చేపట్టిన పోరాటం సముచితమని పేర్కొన్నారు. కార్మికుల ఐక్యత, పోరాట స్ఫూర్తి అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ గారు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. అలాగే దశరథ్ రెడ్డి, కుమార్ యాదవ్, విజయ్, దేవానంద్, భిక్షపతి, నరసింహ గౌడ్, శ్రీధర్ చారి, గుండమొల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ పని: ధూళిపాళ్ల

11 సీట్లకు పడిపోయినా వైసీపీ నేతల్లో మార్పు రాలేదన్న ధూళిపాళ్ల

సంగం డెయిరీ కోసం 15 ఏళ్లుగా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని వెల్లడి

అంబటి తన స్వార్థం కోసం మహిళలను రోడ్లపైకి తెస్తున్నారని మండిపాటు



వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలపై పొన్నూరు టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కులాల మధ్య చిచ్చుపెట్టడమే జగన్ అండ్ కో పనిగా పెట్టుకుందని, వారి ప్రజావ్యతిరేక చర్యల వల్లే ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేశారని దుయ్యబట్టారు. అంతటి ఘోర పరాజయం తర్వాత కూడా వైసీపీ నేతల్లో మార్పు రాలేదని, మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల పాలనలో జడ్జిలు, వారి కుటుంబాలపై సైతం దుష్ప్రచారం చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేశారని మండిపడ్డారు.రైతుల పేరుతో వైసీపీ నేతలు తనపై, సంగం డెయిరీపై చేస్తున్న ఆరోపణలను ధూళిపాళ్ల తీవ్రంగా ఖండించారు. తాము ప్రభుత్వాలపై ఆధారపడి వ్యాపారం చేయడం లేదని, గత 15 ఏళ్లుగా డెయిరీ అవసరాల కోసం మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మొక్కజొన్న కొనుగోలుపై నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమని... అన్నదాతలను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశారని గుర్తుచేశారు. రాజకీయ లబ్ధి కోసమే జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని, అంబటి రాంబాబు తన స్వార్థం కోసం మహిళలను రోడ్లపైకి తెచ్చి కేసుల్లో ఇరికిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శత ప్రశ్న శరసంధానం" గ్రంథం ఆవిష్కరణ

**హైదరాబాద్:** షిర్డీ సాయిబాబాపై ఇటీవల కాలంలో పలువురు వ్యక్తులు చేస్తున్న వివిధ ఆరోపణలకు స్పష్టతనిస్తూ, ప్రామాణిక ఆధారాలతో సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి రచించిన "శత ప్రశ్న శరసంధానం" గ్రంథాన్ని ఘనంగా ఆవిష్కరించారు. నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరిగింది. షిర్డీ సాయిబాబా జీవితం, బోధనలు, ఆధ్యాత్మిక పరంపరపై వస్తున్న సందేహాలు, విమర్శలు మరియు ఆరోపణలకు సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. "శత ప్రశ్న శరసంధానం" పేరుతో రూపొందించిన ఈ పుస్తకాన్ని సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి మొత్తం 11 భాషల్లో రచించడం విశేషం. భక్తుల్లో నెలకొన్న అనేక సందేహాలకు చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రామాణిక ఆధారాలతో సమగ్ర వివరణ ఇవ్వడమే ఈ గ్రంథం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ షిర్డీ సాయి దేవాలయాల నిర్వాహకులు, ట్రస్టు సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సాయి మందిరాల ప్రతినిధులు మాట్లాడుతూ, సాయిబాబాపై అసత్య ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి ప్రసంగిస్తూ, ఏ ఆధ్యాత్మిక మహానుభావుడి గురించి అయినా అవగాహన లేకుండా విమర్శలు చేయడం సమాజంలో అయోమయానికి దారితీస్తుందని అన్నారు. సాయిబాబా జీవితం మానవత్వం, సేవాభావం, సమానత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. భక్తుల సందేహాలకు సమగ్ర సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ముగిసింది.



## 'ఫిదా'లో 'భానుమతి' పాత్ర కోసం ఆరు నెలల టైమ్ అడిగిన సాయి పల్లవి!

'ఫిదా' సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నటి సాయి పల్లవి. ఆమె పోషించిన భానుమతి పాత్ర ఎంతగా ఆకట్టుకుందో తెలిసిందే. అయితే, ఆ పాత్ర అంతగా పండటం వెనుక ఆమె అంకితభావం, పట్టుదల ఉన్నాయి. దర్శకుడు శేఖర్ కమ్ముల 'ఫిదా' కథతో సంప్రదించినప్పుడు, సాయి పల్లవి జార్జియాలో ఎంబీబీఎస్ చివరి దశలో ఉన్నారు.సినిమా చేయడానికి వెంటనే అంగీకరించినప్పటికీ, తన చదువు పూర్తి చేయడానికి ఆరు నెలల సమయం కావాలని దర్శకుడిని కోరారు. ఆమె నిబద్ధతను అర్థం చేసుకున్న శేఖర్ కమ్ముల అందుకు అంగీకరించారు. 2016లో డిగ్రీ పూర్తి చేసుకుని వచ్చిన సాయి పల్లవి, ఆ తర్వాత 'ఫిదా' కోసం సిద్ధమయ్యారు. తమిళనాడుకు చెందిన ఆమెకు తెలంగాణ యాసలో మాట్లాడటం పెద్ద సవాలుగా మారింది. సాధారణంగా ఇతర భాషా నటీమణులకు డబ్బింగ్ ఆర్టిస్టులు గాత్రదానం చేస్తారు. కానీ, సాయి పల్లవి తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. దర్శకుడు శేఖర్ కమ్ముల సహాయంతో తెలంగాణ యాసలోని నుడికారాలను, ఉచ్ఛారణను ఓపికగా నేర్చుకున్నారు. డబ్బింగ్ సమయంలో ఎన్నో తప్పులు చేసినా, పట్టుదలతో మళ్లీ మళ్లీ ప్రయత్నించి భానుమతి పాత్రకు ప్రాణం పోశారు.



## డ్రైవర్ లేని ట్యాక్సీలో ప్రయాణించిన నటి మీనా

ప్రముఖ నటి మీనా డ్రైవర్ లేని ట్యాక్సీలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ప్రయాణానికి సంబంధించిన వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేయగా, అది ఇప్పుడు వైరల్‌గా మారింది. "మీకు నా డ్రైవర్‌ను పరిచయం చేయనా?" అని మీనా ప్రశ్నించడం... ఆ తర్వాత కెమెరాను డ్రైవర్ సీటు వైపు తిప్పగా, అది ఖాళీగా కనిపించడం... "ఇది డ్రైవర్‌లెస్ ట్యాక్సీ" అని ఆమె నవ్వుతూ చెప్పడం ఆ వీడియోలో చూడొచ్చు. "టెక్నాలజీని నమ్మి, ఈ దృశ్యాన్ని ఆస్వాదిస్తున్నాను" అని ఈ పోస్ట్‌కు ఆమె క్యాప్షన్ జోడించారు. ఈ అనుభవం ఆమెకు ఎక్కడ ఎదురైందనేది స్పష్టంగా తెలియకపోయినా, ఇది అమెరికాలో జరిగి ఉంటుందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, మీనా ప్రస్తుతం మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ సరసన 'దృశ్యం 3'లో నటిస్తున్నారు. జీతూ జోసెఫ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. ఇటీవల విడుదలైన టీజర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. జార్జ్ కుట్టి (మోహన్‌లాల్) పాత్ర ఈసారి భయంతో, ఆందోళనతో కనిపించడం గమనార్హం. "నా ఈ పోరాటం నేను పుట్టినప్పుడే మొదలైంది. ఇప్పుడు నాకు భయంగా ఉంది సార్" అని దేవుడితో చెప్పుకుంటున్న డైలాగ్‌లు ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఖ/యూ 13ం సర్టిఫికేట్ జారీ చేసింది. వాస్తవానికి ఏప్రిల్ 2న విడుదల కావాల్సిన ఈ సినిమా, గల్ఫ్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా వాయిదా పడింది. మే 21న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

## మనం చేసే పని మన మనసు చెప్పిన దారిలోనే ఉండాలి: శోభిత ధూళిపాళ



సినీ నటి, హీరో అక్కినేని నాగచైతన్య భార్య శోభిత ధూళిపాళ తన కెరీర్‌తోనే కాకుండా, తన వ్యక్తిత్వంతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. నాగచైతన్యతో వివాహం తర్వాత వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదిస్తూనే, వృత్తి పరంగా కూడా ఆమె బిజీగా ఉంటున్నారు. దుబాయ్‌కు చెందిన ప్రముఖ తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్ శ్రీలత అడెపల్లి, ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న తెలుగు మహిళలను అభినందిస్తూ ఒక ప్రత్యేక వీడియోను రూపొందించారు. ఈ జాబితాలో శోభిత పేరును కూడా ప్రస్తావించడం విశేషం. ప్రపంచ వేదికలపై తెలుగు వారి ప్రతిభను చాటుతున్న మహిళలందరినీ ఒకే చోట చేర్చి గౌరవించడం అందరినీ ఆకట్టుకుంది. శ్రీలత పోస్ట్‌పై శోభిత స్పందిస్తూ తన జీవిత సూత్రాన్ని పంచుకున్నారు. జీవితంలో మనం చేసే ప్రతి పని మన మనసు చెప్పిన దారిలోనే ఉండాలని... అప్పుడే ఆ క్షణాలు అర్థవంతంగా ఉంటాయని చెప్పారు. ఇతరుల కోసం కాకుండా, మనకు మనం నిజాయతీగా ఉండటం, మనల్ని మనం గౌరవించుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం ద్వారానే సమాజంలో మహిళలు మరింత ఎత్తుకు ఎదుగుతారని తెలిపారు.

## హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్..



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని భామ కృతిసనన్. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా టాలీవుడ్‌లో ఈ భామకున్న ఫ్యాన్ బేస్ ఎక్కువే అని చెప్పాలి. చాలా కాలంగా హిందీ సినిమాలకే పరిమితమైన ఈ ముద్దుగుమ్మ కాస్ట్ కటింగ్ కారణంగా హీరోయిన్లు ఎలా ప్రభావితం అవుతున్నారో చెప్పుకొచ్చింది కృతిసనన్. బడ్జెట్ నియంత్రణలో భాగంగా నిర్మాతలు మొదట హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్ పెడుతున్నారని తాజాగా ఓ చర్చ నెట్టింట కొనసాగుతుంది. ఈ విషయమై కృతిసనన్ మాట్లాడుతూ.. మధ్య శ్రేణి (మిడ్ రేంజ్ హీరోయిన్లు) రెమ్యునరేషన్లను నిర్మాతలు పున: పరిశీలిస్తున్నారంది. అయితే ఇండస్ట్రీలో స్టార్ హీరోలకు ఇచ్చే భారీ రెమ్యునరేషన్లపై ఇప్పటికీ అతి తక్కువ స్థాయిలో చర్చ నడుస్తుందని చెప్పింది. కాస్ట్ కటింగ్ ఎఫెక్ట్ ప్రధానంగా హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులపైనే పడుతుందని అభిప్రాయపడ్డింది. అదే సమయంలో కేవలం టాప్ హీరోల రెమ్యునరేషన్లు తగ్గించుకుంటేనే మార్పు మొదలవుతుందని ఓ వర్గానికి చెందిన దర్శకనిర్మాతలు నమ్ముతున్నారని చెప్పుకొచ్చింది. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే బ్యాక్ టు బ్యాక్ బాక్సాఫీస్ ఫెయిల్యూర్స్ కారణంగా, థియాట్రికల్ రెవెన్యూ పడిపోవడం కారణంగా నిర్మాతలు ప్రొడక్షన్ ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్.

## రష్మిక బాటలోనే పాయల్.. తెలుగబ్బాయినే పెళ్లాడతా'



టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్ మూవీ 'ప్రసన్న వదనం'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన కన్నడ బ్యూటీ పాయల్ రాధాకృష్ణ. ఆ తర్వాత చౌర్యపాఠం అనే చిత్రంలోనూ మెరిసింది. ఇటీవలే పాపం ప్రతాప్ మూవీతో ప్రేక్షకులను అలరించింది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. ప్రస్తుతం పాయల్ మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్ అనే మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా మే 15న థియేటర్లలో సందడి చేయనుంది. ప్రస్తుతం మూవీ ప్రమోషన్లతో బిజీగా ఉన్న మేకర్స్ తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్‌మీట్‌కు హాజరైన పాయల్ రాధాకృష్ణ ఆసక్తికర కామెంట్స్ చేసింది. తాను కన్నడకు చెందిన వ్యక్తినే.. కానీ పెళ్లి విషయంలో మాత్రం తెలుగువాడే కావాలని బోల్డ్ కామెంట్స్ చేసింది. తనకు గుర్తింపు, గౌరవం, ఉపాధిని ఇచ్చింది టాలీవుడ్ పరిశ్రమనేనని తెలిపింది. తెలుగు ప్రేక్షకులు చూపించే ఆదరణ వల్లే తను ఈ స్థాయిలో ఉన్నానని పేర్కొంది. తెలుగు చిత్ర పరిశ్రమ తనకు ఆర్థిక భరోసాను ఇచ్చిందని వెల్లడించింది. అందుకే తన లైఫ్ పార్ట్‌నర్ కూడా తెలుగు వాడే కావాలని కోరుకుంటున్నట్లు పాయల్ వెల్లడించింది.ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కన్నడ బ్యూటీలంతా తెలుగింటి కోడలైపోతున్నారంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఏడాదిలోనే కన్నడ భామ రష్మిక మందన్నా.. మన తెలుగు హీరో విజయ్ దేవరకొండను పెళ్లాడిన సంగతి తెలిసిందే. తాజాగా మరో హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ సైతం అదే బాటలో దూసుకెళ్తోంది. తెలుగబ్బాయినే పెళ్లి చేసుకుంటానని తన మనసులోని మాటను బయటకు చెప్పేసింది. తెలుగు కోడలిగా స్థిరపడాలన్న పాయల్ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.